
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సంగారెడ్డి 5 మెదక్
జిల్లాల వార్తలు
శుక్రవారం 30 ఆగస్టు 2024



క్రీడల అభివృద్ధికి కృషి : అదనపు కలెక్టర్

మెదక్ అర్బన్, ఆగస్టు 29: జిల్లాలో క్రీడల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్టు అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. భారత హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం ఇందిరాగాంధీ స్టేడియంలో వివిధ శాఖల ఉద్యోగులకు నిర్వహించిన క్రీడల్లో విజేతలకు ఆయన బహుమతులు అందజేశారు. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరైన సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు విద్యార్థులకు శారీరక, మానసిక ఆరోగ్యానికి సహకరిస్తాయని పేర్కొన్నారు.

ఎక్కడి పనులు అక్కడే..

- రెండేళ్లుగా పెండింగ్‌లోనే ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణం
- నిలిచిన షాపింగ్ కాంప్లెక్స్ పనులు
- ల్యాండ్ పూలింగ్‌పై పీటముడి
- పూర్తికాని వైకుంఠధామం
- ప్రారంభానికి నోచుకోని రైతుబజార్
- మెదక్ జిల్లా కేంద్రంలో నిలిచిన అభివృద్ధి

మెదక్ జిల్లా కేంద్రంలో రాష్ట్ర ప్రభుత్వ నిధులతో చేపట్టిన పలు ప్రభుత్వ భవన నిర్మాణపు పనులు ముందుకుసాగడం లేదు. గత ప్రభుత్వ హయాంలో భవన నిర్మాణాలకు కోట్లాది రూపాయలు కేటాయిస్తూ జీవోలు జారీ చేశారు. కానీ పనులు మాత్రం ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్నట్టు సాగుతున్నాయి.

మెదక్, ఆగస్టు 29: జిల్లా కేంద్రంగా ఆవిర్భవించాక మెదక్ పట్టణం వేగంగా అభివృద్ధి చెందుతోంది. జనాభా పెరిగిపోతుండడంతో ప్రస్తుతం కొనసాగుతున్న మార్కెట్ ఏమాత్రం సరిపోవడం లేదు. చిరు వ్యాపారులు రోడ్ల పక్కనే కూరగాయలు, మాంసం విక్రయాలు జరుపుతున్నారు. ప్రజల సౌకర్యం కోసం రూ. 7 కోట్ల అంచనాతో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణానికి రెండేళ్ల క్రితం పనులు ప్రారంభించారు. స్పెషల్ డెవలప్‌మెంట్ గ్రాంట్ కింద చేపట్టిన ఈ పనులు పిల్లర్ల దశలో నిలిచిపోయాయి. ఆరు నెలల్లో పనులు పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నా నిధులు లేక నిలిచిపోయాయి.



రాందాస్ చౌరస్తాలో అర్థాంతరంగా ఆగిపోయిన షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులు

రూ. 3 కోట్లతో దుకాణ సముదాయం

పట్టణ నడిబొడ్డున రాందాస్ చౌరస్తా వద్ద రూ. 3 కోట్లు పట్టణ ప్రగతి నిధులతో చేపట్టిన బహుళ అంతస్తుల దుకాణ సముదాయానిదీ అదే దుస్థితి. మొదట రూపొందించిన డిజైన్ మార్చి సెల్లార్ ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. గతంలో కుంట ఉన్నచోటనే ఈ నిర్మాణం చేపడుతుండడంతో సెల్లార్ కోసం తవ్విన గొయ్యి వర్షం నీటితో నిండిపోయింది. పిచ్చిమొక్కలు పెరిగి ఆ ప్రాంతమంతా దోమలు, దుర్వాసనతో కంపు కొడుతోంది. ఇప్పటికే కాంట్రాక్టర్‌కు నోటీసులు ఇచ్చినట్టు అధికారులు తెలిపారు.

వైకుంఠధామం, స్ట్రీట్ మార్కెట్‌దీ అదే పరిస్థితి

రూ. 2.5 కోట్లతో పట్టణ శివార్లలో నిర్మిస్తున్న మోడ్రన్ వైకుంఠధామం పనులు సైతం మధ్యలోనే నిలిచిపోయాయి. ఫతేనగర్ వీధిలో స్ట్రీట్ మార్కెట్ నిర్మాణ ఏళ్ల తరబడి కొనసాగుతోంది. పిట్లం చెరువు, గోసముద్రం చెరువులను అనుసంధానిస్తూ ట్యాంక్‌బండ్ నిర్మాణానికి గత ప్రభుత్వం హయాంలో పనులు ప్రారంభమయ్యాయి. ఇరిగేషన్ అధికారుల పర్యవేక్షణలో మొదలుపెట్టి పనులు నాలుగేళ్లు గడుస్తున్నా ఇంకా తుది దశకు చేరుకోలేదు. ఈ పనులకు గతంలోనే రూ.10 కోట్లు మంజూరయ్యాయి. పనులు సమయానికి పూర్తికాకపోవడంతో నిర్మాణ వ్యయం అంతకంతకూ పెరిగిపోతోంది. పిల్లికొటాల్ వద్ద మున్సిపల్ ఆధ్వర్యంలో వెంచర్ ఏర్పాటు కోసం చేపట్టిన ల్యాండ్ పూలింగ్ పనులు కూడా నిలిచిపోయాయి. భూములు కోల్పోయిన రైతులతో వెంచర్‌లో ప్లాట్లు ఇస్తామని ఒప్పందం కుదుర్చుకున్నారు. పనులు ఆగిపోవడంతో తమ భూములు తిరిగివ్వాలని ఒత్తిడి తెస్తున్నారని సంబంధిత కాంట్రాక్టర్ వాపోతున్నారు.

రైతుబజార్ ప్రారంభమెప్పుడో?

పట్టణంలో కూరగాయల వ్యాపారాల కోసం రైతుబజార్ నిర్మాణం చేపట్టారు. మూడు సంవత్సరాలుగా ఆగుతూ.. సాగుతూ.. ప్రస్తుతం తుది దశకు చేరుకుంది. ప్రస్తుతం ఉన్న మార్కెట్‌లో స్థలం సరిపోక చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చే రైతులు పట్టణంలో రోడ్ల పక్కనే కూరగాయలు విక్రయిస్తున్నారు. దీంతో, అసలే ఇరుకుగా ఉన్న రోడ్లు నడబడానికి కూడా వీలులేకుండా తయారయ్యాయి. రైతుబజార్‌ను ప్రారంభిస్తే చిరువ్యాపారులతో పాటు ప్రజలకు కూడా సౌకర్యంగా ఉంటుందని ప్రజలు కోరుతున్నారు.

నిలిచిన పట్టణప్రగతి నిధులు

పట్టణాల్లో అభివృద్ధి కోసం గత ప్రభుత్వం పట్టణ ప్రగతి కార్యక్రమం చేపట్టింది. రెండేళ్లపాటు ప్రతీ నెల జనాభాకు అనుగుణంగా నిధులు కేటాయించేవారు. క్రమేణా ప్రభుత్వం నిధులు విడుదల చేయడం నిలిపేసింది. మున్సిపల్ అధికారులు మాత్రం అదనపు కలెక్టర్ అధ్యక్షతన కొనసాగే డీఎల్‌సీ అనుమతితో అభివృద్ధి పనులకు టెండర్లు పిలిచి పనులు చేయిస్తోంది. ఇప్పటికే మెదక్ మున్సిపల్ పరిధిలో రూ.2 కోట్లతో సీసీరోడ్లు, మురికికాల్వల నిర్మాణలు పూర్తిచేసి బిల్లుల కోసం 18 నెలలుగా గుత్తేదారులు ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం నిధులు మంజూరుచేస్తేనే పెండింగ్ పనులు తిరిగి ప్రారంభమవుతాయి.



బ్యాంకర్లతో నిర్వహించిన సమన్వయ సమావేశంలో మాట్లాడుతున్న సంగారెడ్డి ఎస్పీ రూపేష్

బ్యాంకర్ల సహకారంతోనే సైబర్ నేరాల బాధితులకు సత్వర న్యాయం

అపరిచితులకు బ్యాంక్ అకౌంట్లు ఇవ్వొద్దు

బ్యాంకర్ల సమావేశంలో సంగారెడ్డి ఎస్పీ రూపేష్

సంగారెడ్డి క్రైం, ఆగస్టు 29 : సైబర్ బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూడడంలో బ్యాంకర్ల పాత్ర కీలకమని సంగారెడ్డి ఎస్పీ చెన్నూరి రూపేష్ పేర్కొన్నారు. సంగారెడ్డిలోని జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం జిల్లాలోని వివిధ బ్యాంకుల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంకేతికత అభివృద్ధి చెందుతున్నట్టే సైబర్ నేరాలు పెరుగుతున్నాయని పేర్కొన్నారు. యూపీఐ, బ్యాంకు ఖాతాల సమాచారం ఆధారం చేసుకుని సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారని తెలిపారు. సైబర్ నేరాలపై దర్యాప్తునకు అధికారులకు సహకరించాలని, నేరానికి గురైన బ్యాంకు అకౌంట్లకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని పోలీసులకు ఇవ్వాలని కోరారు. కోర్టు అనుమతితో బాధితులకు చేరాల్సిన డబ్బును అకౌంట్‌లో జమచేసి బాధితులకు అండగా నిలవాలన్నారు. ప్రతీ బ్యాంకులు, ఏటీఎంలలో హై రెజిల్యూషన్ సీసీకెమెరాలు, సెక్యూరిటీ అలారం అమర్చాలని సూచించారు. కార్యక్రమంలో డీఎస్పీలు సత్తయ్య గౌడ్, రవీందర్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, నార్కోటిక్ ఇన్‌స్పెక్టర్ రమేష్, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ విజయకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



బోధనాస్పత్రి నుంచి 34 మంది వైద్యుల బదిలీ

టీవీవీపీ ఆస్పత్రులకు సర్దుబాటు చేస్తూ ఉత్తర్వులు

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 29 : నూతన బోధన ఆస్పత్రుల్లో పనిచేస్తున్న తెలంగాణ వైద్య విధాన పరిషత్ (టీవీవీపీ) డాక్టర్లను బదిలీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. టీవీవీపీ కమిషనర్ సూచనలతో కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆదేశాల ప్రకారం సంగారెడ్డి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో (బోధనాస్పత్రి) టీవీవీపీ కింద పనిచేస్తున్న డాక్టర్లను జిల్లాలోని ఆయా ప్రభుత్వ ఆస్పత్రులకు బదిలీ చేస్తూ డీసీహెచ్ఎస్ డా.సంగారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. 34 మంది సివిల్ సర్జన్ స్పెషలిస్టులు, డిప్యూటీ సివిల్ సర్జన్లు, సివిల్ అసిస్టెంట్ సర్జన్లను వివిధ ఆస్పత్రుల్లో సర్దుబాటు చేశారు. వీరిలో స్పెషాలిటీలవారీగా అనస్తీషియా-4, డెర్మటాలజీ-1, జనరల్ మెడిసిన్-2, పల్మనాలజీ-1, జనరల్ సర్జన్-2, గైనకాలజీ-5, ఆప్తమాలజీ-4, ఆర్థోపెడిక్-3, పాథాలజీ-2, పీడియాట్రీషియన్-4, సైకియాట్రి-1, రేడియాలజీ-3, ఎంబీబీఎస్ ఇద్దరు ఉన్నారు. వీరంతా వెంటనే వారికి కేటాయించిన ఆస్పత్రుల్లో రిపోర్టు చేయాలని ఆదేశించినట్టు డీసీహెచ్ఎస్ పేర్కొన్నారు.

తేలనున్న పశువుల లెక్క

ఎల్లుండి నుంచి పశుగణనకు శ్రీకారం

2019లో 22,43,106 పశువులు

సంగారెడ్డి టౌన్, ఆగస్టు 29 : ప్రభుత్వం పశువుల లెక్కను పక్కాగా తేల్చేందుకు రంగం సిద్ధం చేసింది. ప్రభుత్వ ఉత్తర్వులమేరకు పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో సెప్టెంబరు 1 నుంచి పశుగణన చేపట్టనుంది. ఇందుకోసం 90 మంది ఎన్యూమరేటర్లు, 32 మంది సూపర్‌వైజర్లను నియమించింది. వీరందరికీ గురువారం శిక్షణ నిర్వహించారు. వీరంతా జిల్లాలోని 647 గ్రామ పంచాయతీలతో పాటు మదిర గ్రామాలు, గిరిజన తండాలు, మునిసిపాలిటీల పరిధిలో ఇంటింటికి తిరిగి పశువుల వివరాలను సేకరిస్తారు.

ఐదేళ్లకోసారి పశుగణన

ప్రతీ ఐదేళ్లకోసారి ప్రభుత్వం పశుగణన చేపడుతుంది. ఇందులో భాగంగానే 2019లో చేపట్టిన పశుగణన ప్రకారం సంగారెడ్డి జిల్లాలో 22,43,106 పశువులు ఉన్నట్లు నిర్ధారించారు. ఇందులో ఆవులు లక్షా 56,282, గేదెలు లక్షా 68,995, గొర్రెలు 4,42,103, మేకలు 2,31,311, కోళ్లు 12,24,576, పందులు 6,353, కుక్కలు 13,486 ఉన్నట్లు గుర్తించారు. ఈసారి చేపట్టనున్న పశుగణన ప్రకారం జిల్లాలో పశు సంపద పెరిగే అవకాశమున్నదని ఆ శాఖ అధికారులు అభిప్రాయపడుతున్నారు. గడిచిన ఐదేళ్లలో గత ప్రభుత్వం గొర్రెలు, బర్రెల పంపిణీతో పాటు కోళ్ల పెంపకానికి ప్రాధాన్యతనిచ్చిన విషయం తెలిసిందే. ఈ లెక్కన జిల్లాలో గేదెలు, గొర్రెలు, మేకలు, కోళ్ల సంపద గణనీయంగా పెరగవచ్చని అంచనా వేస్తున్నారు.

ఏర్పాట్లు పూర్తిచేశాం

ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో ఎల్లుండి నుంచి పశుగణన ప్రారంభిస్తాం. ఇందుకోసం 90 మంది ఎన్యూమరేటర్లు, 32 మంది సూపర్‌వైజర్లకు గురువారం శిక్షణ ఇచ్చాం. వీరంతా ఇంటింటికి తిరిగి పశువుల వివరాలను సేకరించి, అప్పటికప్పుడూ ఆన్‌లైన్‌లో పొందుపరుస్తారు. ఈ ప్రక్రియ నెల రోజుల్లో పూర్తిచేస్తాం.

- వసంతకుమారి, జేడీ పశుసంవర్ధకశాఖ

సామాజిక బాధ్యతగా జలాశయాల పరిరక్షణ

- చెరువుల పరిసరాల పరిశుభ్రత జీహెచ్ఎంసీదే
- వినాయక నిమజ్జనం, బతుకమ్మ పండుగలకు తగిన ఏర్పాట్లు
- జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి



పటాన్‌చెరు సాకిచెరువును పరిశీలిస్తున్న మేయర్ గద్వాల విజయలక్ష్మి, కార్పొరేటర్లు

పటాన్‌చెరు/రామచంద్రాపురం, ఆగస్టు 29: జీహెచ్ఎంసీ పరిధిలో జలాశయాల పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఇందుకోసం కఠిన చర్యలకు వెనుకాడడం లేదని మేయర్ గద్వాల విజయలక్ష్మి స్పష్టం చేశారు. పటాన్‌చెరులోని సాకిచెరువు, తిమ్మక్కచెరువు, రామచంద్రాపురంలోని రాయసముద్రం చెరువులను గురువారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ, భూగర్భ జలాలను స్థిరీకరించడంలో గొలుసుకట్టు చెరువులు, కుంటలు ప్రధాన పాత్ర పోషిస్తాయన్నారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని 150 డివిజన్లలోని వందలాది చెరువులను జీహెచ్ఎంసీ తమ ఆధీనంలోకి తీసుకుందని తెలిపారు. హెచ్ఎండీఏ, ఇరిగేషన్ శాఖలతో కలిసి చెరువుల అభివృద్ధికి జీహెచ్ఎంసీ ప్రత్యేకంగా కృషి చేస్తోందని పేర్కొన్నారు. ముఖ్యంగా చెరువులు, కుంటలు కబ్జాలకు గురికాకుండా చూడటంతో పాటు చెరువు చుట్టుపక్కల ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పడేలా అనేక సుందరీకరణ ప్రాజెక్టులకు నిధులను మంజూరు చేస్తున్నామని తెలియజేశారు. పటాన్‌చెరు సాకిచెరువులోకి డ్రైనేజీ నీరు కలవకుండా సుమారు రూ. 14 కోట్లతో జీహెచ్ఎంసీ చేపట్టిన బాక్స్ డ్రైనేజీ పనులు తుది దశకు చేరుకున్నాయని తెలిపారు. చెరువులు, కుంటలు కాపాడుకోవడం కోసం సామాజిక బాధ్యతగా కొనసాగాలన్నారు. ఆయా డివిజన్ల ప్రజలు, కాలనీల సంక్షేమ సంఘాల నాయకులు కలికి కట్టుగా చెరువులను కాపాడుకునే బృహత్తర కార్యక్రమాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఇక వచ్చే వినాయకచవితి నిమజ్జనం, బతుకమ్మ పండగల సందర్భంగా చెరువుల్లోకి బతుకమ్మఘాట్‌ల వద్ద జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా రోజు పెద్దఎత్తున పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. చెరువుల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు, గుర్రపుడెక్కను తక్షణం తొలగించి లైటింగ్ సదుపాయాలను కల్పించాలన్నారు. ఈ సందర్భంగా తమ డివిజన్ల పరిధిలోని సమస్యలను కార్పొరేటర్లు మెట్టుకుమార్‌యాదవ్, పుష్పనగేష్ మేయర్ దృష్టికి తీసుకెళ్లారు. త్వరలోనే ఉన్నతస్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించి నిధులను మంజూరు చేస్తామని మేయర్ హామీ ఇచ్చారు.

రూ.3.75 కోట్ల విలువైన అల్ప్రాజోలం, గంజాయి దహనం

సంగారెడ్డి క్రైం, ఆగస్టు 29 : సంగారెడ్డి జిల్లాలోని వివిధ పోలీస్‌స్టేషన్ల పరిధిలో 13 కేసుల్లో సీజ్ చేసిన రూ.3.75కోట్ల విలువైన 13.990 కిలోల అల్ప్రాజోలం, 950.285 కిలోల ఎండు గంజాయి దహనం చేసినట్లు సంగారెడ్డి ఎస్పీ చెన్నూరి రూపేష్ తెలిపారు. జిల్లా డ్రగ్ డిస్పోజల్ కమిటీ ఆధ్వర్యంలో జిల్లాలోని పాశమైలారం పారిశ్రామిక వాడలోని మెడికేర్ పరిశ్రమలో ఇన్సినిరేషన్ ప్రక్రియ ద్వారా పర్యావరణ కాలుష్య నియంత్రణ మండలి నిబంధనలను పాటిస్తూ గురువారం దహనం చేసినట్లు ఆయన వివరించారు. దీని విలువ దాదాపు రూ. 3.75 కోట్లు ఉంటుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేవారిని అరికట్టడం కోసం జిల్లావ్యాప్తంగా స్పెషల్ టాస్క్‌ఫోర్స్ పోలీసుల ద్వారా విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఎవరైనా గంజాయి, ఇతర మత్తు పదార్థాలను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదనపు ఎస్పీ సంజీవరావు, మెడికేర్ పరిశ్రమ మేనేజర్ శివారెడ్డి, పటాన్‌చెరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి, సంగారెడ్డి డీఎస్పీ సత్తయ్యగౌడ్, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ రమేష్, పటాన్‌చెరు ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ ఉన్నారు.



పోలీసులు దహనం చేసిన మత్తుపదార్థాలు



కౌన్సిలర్‌గా ప్రమాణ స్వీకారం చేస్తున్న నరసింహరాజు

నాలుగున్నరేళ్లు పోరాడి పదవి సాధించిండు

కోర్టు తీర్పుతో బొల్లారం పదో వార్డు కౌన్సిలర్‌గా స్వతంత్ర అభ్యర్థి ప్రమాణం

బీఆర్ఎస్ మహిళా కౌన్సిలర్‌పై అనర్హత

జిన్నారం, ఆగస్టు 29: మున్సిపల్ ఎన్నికల్లో రెండో స్థానంలో నిలిచి.. నాలుగున్నరేళ్ల న్యాయపోరాటం చేసి గెలిచిన ఓ వ్యక్తి ఎట్టకేలకు కౌన్సిలర్‌గా ప్రమాణ స్వీకారం చేశారు. సంగారెడ్డి జిల్లా జిన్నారం మండలం బొల్లారం మున్సిపాలిటీకి 2020 జనవరిలో ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో బీసీ జనరల్ స్థానమైన 10వ వార్డు కౌన్సిలర్‌గా బీఆర్ఎస్ అభ్యర్థి బి.శైలజ గెలుపొందారు. స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగిన నరసింహరాజు రెండో స్థానంలో నిలిచారు. అయితే, శైలజ బీసీ కాదని... ఓసీ సామాజికవర్గానికి చెందినవారని పేర్కొంటూ నరసింహరాజు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఈ కేసును విచారించిన జిల్లా న్యాయస్థానం శైలజను అనర్హురాలిగా ప్రకటిస్తూ రెండు నెలల క్రితం తీర్పు ఇచ్చింది. దీంతో, ఎన్నికల్లో రెండో స్థానంలో నిలిచిన నరసింహరాజు కౌన్సిలర్ అయ్యారు. కోర్టు, జిల్లా అధికారుల ఆదేశాల మేరకు మున్సిపల్ కమిషనర్ మంగతాయారు.. నరసింహరాజుతో కౌన్సిలర్‌గా గురువారం ప్రమాణ స్వీకారం చేయించారు. అయితే, నరసింహరాజు పదవీ కాలం మరో ఐదు నెలల్లోనే ముగియనుంది. కాగా, నరసింహరాజు ప్రమాణ స్వీకారం అనంతరం కాంగ్రెస్ ఆధ్వర్యంలో పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ అనీల్‌కుమార్ రెడ్డి, కౌన్సిలర్ చంద్రారెడ్డి, జైపాల్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, గోపాలమ్మ, మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మీ చెక్కుల పంపిణీలో రసాభాస

కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ శ్రేణులు పోటాపోటీ నినాదాలు

మెదక్ జిల్లా హత్నూరలో ఉద్రిక్తత

7లో



హత్నూరలో చెక్కుల పంపిణీ కార్యక్రమంలో పోటాపోటీగా నినాదాలు చేస్తున్న కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ నాయకులు

మారనున్న జహీరాబాద్ రూపురేఖలు

జహీరాబాద్ ఎంపీ సురేష్‌కుమార్‌షెట్కార్

7లో

రైతుల ఆర్థిక స్వావలంబనకు సహకారం

నాబార్డు డీడీఎం కృష్ణతేజ

7లో

శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంపై విద్యార్థులకు అవగాహన అవసరం

ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి

నర్సాపూర్, ఆగస్టు 29 : నేటి విద్యార్థులకు మారుతున్న కాలానుగుణంగా శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్గి ఉండాలని, అందుకు కృషి విజ్ఞాన గ్రామీణాభివృద్ధి సంస్థ చేస్తున్న కృషి అభినందనీయమని నర్సాపూర్ ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని పెద్దచింతకుంట ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో గురువారం గగన్‌యాన్- 3 భారతీ అంతరిక్ష పరిశోధన సంస్థ అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి హాజరు కాగా భారతీయ అంతరిక్ష పరిశోధన సంస్థ శాస్త్రవేత్త శ్రీనివాస్‌రెడ్డి పాల్గొని విద్యార్థులకు అంతరిక్ష పరిశోధన సంస్థ చేస్తున్న ప్రయోగాలు వాటి వల్ల ఉపయోగాలు, భవిష్యత్తు తరాలకు ఏవిధంగా ఉపయోగపడుతాయనే అంశాలను విపులంగా వివరించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ నేటి విద్యార్థులు కేవలం పుస్తక నాలెడ్జి కాకుండా సాంకేతిక పరంగా వస్తున్న మార్పులను కూడా తెలుసుకోవాల్సిన అవసరముందన్నారు. ముఖ్యంగా గ్రామీణ విద్యార్థులకు సాంకేతికపరమైన అంశాలను తెలిపే అవకాశం తక్కువగా ఉంటుందని అందుకు కృషి విజ్ఞాన గ్రామీణాభివృద్ధి సంస్థ చేస్తున్న కృషి అమోఘమన్నారు. విద్యార్థులు ఇలాంటి కార్యక్రమాల్లో శ్రద్ధగా పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంస్థ చైర్మన్ లక్ష్మీకాంతారావు, మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్‌గుప్తా, ప్రిన్సిపాల్ దామోదర్ తదితరులు పాల్గొన్నారు.



శాస్త్రవేత్తకు మెమెంటో అందజేస్తున్న ఆర్డీవో

సెంట్రల్ జైలును సందర్శించిన న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి


ఆహారాన్ని పరిశీలిస్తున్న న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రమేష్

సంగారెడ్డి క్రైం, ఆగస్టు 29 : కంది మండల కేంద్రంలోని సెంట్రల్ జైలును జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.రమేష్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జైలులోని బ్యారక్‌లు, గదులు, వంట గది, బాత్ రూమ్, జైలు ఆవరణ మొత్తం తిరిగి పరిశీలించారు. ఖైదీలకు అందుతున్న కనీస అవసరాల గురించి ఆయన అడిగి తెలుసుకున్నారు.

తక్కువ ధరకే భూమి వస్తుందని వ్యాపారికి టోకరా

పెద్దశంకరంపేట, ఆగస్టు 29: సంగారెడ్డి జిల్లా కంగ్టి మండలం రాజారాం తండా, ముకుంద్ తండాలకు చెందిన సాగర్‌చౌహాన్, దేవిదాస్, రమాకాంత్, వెంకట్, చందర్, జాదవ్‌లు ముఠాగా ఏర్పడి హైదరాబాద్‌కు చెందిన వ్యాపారి వరప్రసాద్‌ను తక్కువ ధరకే భూమి వస్తుందని చెప్పి మోసగించారు. ఉత్తులూరు శివారులో సాగులో ఉన్న భూమిని చూపించి, నిజాం సాగర్ బ్యాక్‌వాటర్‌లో ఉన్న భూమిని పట్టా చేయించారు. ఉత్తులూరు గ్రామానికి చెందిన రైతులు రాజిరెడ్డిగారి దుర్గయ్య, క్రిష్ణ, యాదగిరి, శంకర్‌కు చెందిన మూడు ఎకరాల భూమిని వరప్రసాద్‌కు అమ్మారు. తర్వాత వ్యాపారి భూమి వద్దకు రాగా.. ఈ భూమి మీదికాదు నాది అని అక్కడి రైతులు తెలుపగా మోసపోయానని గ్రహించాడు. వరప్రసాద్ పోలీసులను ఆశ్రయించారు. మధ్యవర్తులు ఆరుగురు నారాయణఖేడ్, కంగ్టి తదితర మండలాల్లో ఈ విధంగానే మోసం చేయగా వారిపై ఇప్పటికే కేసులు ఉన్నాయి. ఈ మేరకు పేట ఎస్ఐ శంకర్ కేసు నమోదుచేసి విచారణ చేపట్టారు.

దారి దోపిడీ దొంగల ముఠాకు ఏడేళ్ల జైలు

సంగారెడ్డి క్రైం, ఆగస్టు 29 : దారి దోపిడీకి పాల్పడుతున్న ఓ ముఠాకు చెందిన సభ్యులకు ఏడు సంవత్సరాల జైలు శిక్ష విధిస్తూ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి ఎం.రాధాకృష్ణ చౌహాన్ గురువారం తీర్పునిచ్చారని ఎస్పీ రూపేష్ తెలిపారు. వివరాల ప్రకారం.. ఐడీఏ బొల్లారంకు చెందిన ఎస్.రామారావు(30), కె.దేవేందర్‌రావు(26), ఎండీ ఫిరోజ్(25), ఎస్.సంతోష్(23), జి.మోహన్(26), ఎం.సంజయ్‌కుమార్(25), జి.గణేష్(27) ఓ ముఠాగా ఏర్పడ్డారు. పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని పటేల్‌గూడకు చెందిన సంగమేశ్వర హెచ్‌పి గ్యాస్ సూపర్‌వైజర్ విష్ణువర్ధన్‌రెడ్డి 2016 మార్చి 5వ తేదీన గ్యాస్ కంపెనీకి సంబంధించిన రూ.6.28లక్షలు పటాన్‌చెరులోని పంజాబ్ నేషనల్ బ్యాంచ్‌లో జమ చేయడానికి వెళ్లాడు. అదే సమయంలో కారులో వచ్చిన నిందితులు విష్ణువర్ధన్‌రెడ్డిని బెదిరించి రూ.6.28 లక్షలను అపహరించుకుపోయారు. బాధితుని ఫిర్యాదు మేరకు పటాన్‌చెరు అప్పటి ఎస్‌హెచ్‌వో లింగేశ్వర్‌రావు కేసు నమోదు చేసుకుని ఆధారాలను కోర్టులో సమర్పించారు. కేసు పూర్వాపరాలు పరిశీలించిన అనంతరం నేరం రుజువు కావడంతో నిందితులు ఏడుగురికి ఏడు సంవత్సరాల జైలు శిక్ష విధించడంతో పాటు పదివేల రూపాయల జరిమానా విధిస్తూ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి ఎం.రాధాకృష్ణ చౌహాన్ గురువారం తీర్పు చెప్పారు. జరిమానా చెల్లించని పక్షంలో మరో మూడు నెలల సాధారణ జైలు శిక్ష విధించడం జరుగుతుందన్నారు. కాగా నిందితులకు శిక్ష పడేలా కృషి చేసిన పోలీసులు, కోర్టు అధికారులను ఎస్పీ రూపేష్ అభినందించారు.

అత్యాచారం కేసులో నిందితునికి జీవిత ఖైదు

సంగారెడ్డి క్రైం, ఆగస్టు 29 : మానసిక, శారీరక దివ్యాంగురాలిపై అత్యాచారానికి పాల్పడిన నిందితునికి జీవిత ఖైదు విధిస్తూ పోక్సో కోర్టు న్యాయాధికారి జయంతి గురువారం తీర్పు చెప్పారు. ఎస్పీ రూపేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మొగుడంపల్లి మండలం మన్నాపూర్ గ్రామానికి చెందిన మహ్మద్ జబ్బార్(19) 2018 సంవత్సరంలో అదే గ్రామానికి చెందిన మూగ బాలికపై అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ మేరకు చిరాగ్‌పల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరిపారు. కేసు పూర్వాపరాలు పరిశీలించిన అనంతరం నేరం రుజువు కావడంతో నిందితుడు మహ్మద్ జబ్బార్(19)కు జీవిత ఖైదు శిక్ష విధించడంతో పాటు రూ.20వేలు జరిమానా విధిస్తూ పోక్సో కోర్టు న్యాయాధికారి జయంతి గురువారం తీర్పు చెప్పారు. ఈ కేసులో నిందితునికి శిక్ష పడేలా కృషి చేసిన పోలీసులను జిల్లా ఎస్పీ రూపేష్ అభినందించారు.

ఆయిల్‌పాం తోటను సందర్శించిన వ్యవసాయ శాస్త్రవేత్తలు

పుల్‌కల్, ఆగస్టు 29 : చౌటకూర్ మండలం సరాఫ్‌పల్లి గ్రామ శివారులో రైతు కరణం హనుమంతరావు సాగు చేస్తున్న ఆయిల్‌పాం తోటను సంగుపేట ఏరువాక కేంద్రం సమన్వయ కర్త కె.రాహుల్‌విశ్వకర్మ, వ్యవసాయ శాస్త్రవేత్త కె.సరిత గురువారం క్షేత్ర సందర్శన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో ఉద్యానవన శాఖ ప్రోత్సాహంతో రైతులు విరివిగా ఆయిల్‌పాం తోటలను సాగు చేస్తున్నారని, ఇందులో భాగంగానే సరాఫ్‌పల్లిలోనూ ఆయిల్‌పాం తోటను సాగు చేస్తున్నారని పేర్కొన్నారు. మొదటి ఏడాది మొక్కలను కాపాడుకోవడం చాలా ముఖ్యమన్నారు. ఈ పంటకు కొమ్ము పురుగు వ్యాప్తి చెంది నష్ట పరుస్తుందని, ఈ పురుగు తెల్లని అండాకారము గల గుడ్లు రెండు నుంచి అరుఅంగుళాలు కలిగి ఉంటుందన్నారు. లోతులో, తేమగల ప్రాంతాల్లో పడిపోయిన చెట్ల మొదళ్లలో పెట్టి సంతానాన్ని ఉత్పత్తి చేసుకుని, పెద్ద పురుగుల మొవ్వ ప్రాంతంలో వ్యాపించి చెట్టును నాశనం చేస్తుందన్నారు. దీని నివారణకు కొమ్ము పురుగును ఆకర్షించు రైనోల్యూర్ అను ఫెరమోన్ ఎరలు బకెట్లో పెట్టి ఐదెకరాల తోటకు ఒకటి చొప్పున ఉంచి, ఆకర్షితమైన తల్లి పురుగులను నాశనం చేయాలని సూచించారు. అదే విధంగా వేప పిండిని చెట్టు మొదళ్లలో చెట్టుకు వంద గ్రాములతో పాటు 150 గ్రాముల ఇసుకలో కలిపి చల్లాలన్నారు. తోట పరిసర ప్రాంతాల్లో పడిపోయిన చెట్లను తొలగించి శుభ్రంగా ఉంచుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైపీఐ శ్రీకాంత్, రైతు కరణం హనుమంతరావు పాల్గొన్నారు.


ఆయిల్‌పాం తోటలో వ్యవసాయ శాస్త్రవేత్తలు

రైతుల ఆర్థిక స్వావలంబనకు నాబార్డు సహకారం

● డీడీఎం కృష్ణతేజ



కేవీకేలో మొక్కను నాటుతున్న నాబార్డు ప్రతినిధులు

జహీరాబాద్, ఆగస్టు 29 : రైతులు ఆర్థిక స్వాలంబన దిశగా వ్యవసాయం చేయాలని, అందుకు నాబార్డు సహకరిస్తుందని డీడీఎం కృష్ణతేజ పేర్కొన్నారు. గురువారం మండలంలోని అల్గోల్-దిడిగి శివారులోని కేవీకేలో(కృషివిజ్ఞాన కేంద్రం)లో రైతు ఉత్పత్తిదారుల సంఘంతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి నిజామాబాద్, సంగారెడ్డి, కామారెడ్డి, సిద్దిపేట ఆదిలాబాద్, వికారాబాద్, మెదక్ తదితర ప్రాంతాలకు చెందిన 50 ఉత్పత్తిదారుల సంఘాలు హాజరయ్యాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు పంటలు పండించడం మొదలుకుని మార్కెటింగ్ సదుపాయం కల్పించేవరకు వెన్నుదన్నుగ నిలవాలన్నారు. రైతుల అభ్యున్నతిని దృష్టిలో పెట్టుకుని ఉత్పత్తిదారుల సంఘాల బలోపేతానికి తమవంతు బాధ్యతగా కృషి చేస్తున్నామన్నారు. రైతులందరూ యూనిట్‌గా ఏర్పడి పండించిన ధాన్యానికి మద్దతు ధర వచ్చే వరకు విక్రయించకుంటే ఆశించిన ధర కచ్చితంగా వస్తుందన్నారు. పైగా రైతుల వద్దకే కొనుగోలుదారులు వస్తారన్నారు. రైతులు పంటలను పండించడంలో నూతన పద్ధతులను ఒంటబట్టించుకుని వ్యవసాయం చేయాలన్నారు. రసాయన ఎరువులను తక్కువ మోతాదుల్లో వాడుతూ సుస్థిర వ్యవసాయంపై దృష్టి పెట్టాలన్నారు. ముఖ్యంగా గ్రామాల్లో రైతులను సంఘటితం చేస్తూ సభ్యులుగా చేర్చుకుని లాభసాటి వ్యవసాయం చేసేలా ప్రోత్సహించాలన్నారు. అనంతరం వ్యవసాయ శాఖ ఏడీఏ బిక్షపతి, తదితరులు మాట్లాడారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 50 రైతు ఉత్పత్తి సంఘాల సభ్యులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు వరప్రసాద్, శైలజ, ఉద్యాన, వ్యవసాయశాఖ అధికారులు, రైతు ఉత్పత్తిదారుల సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గంజాయి విక్రయదారుల అరెస్ట్

● పోలీసుల అదుపులో ఏడుగురు
● నాలుగు బైక్‌లు, 3 కేజీల గంజాయి పట్టివేత



గంజాయి విక్రయదారుల అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న గజ్వేల్ సీఐ

జగదేవ్‌పూర్, ఆగస్టు 29 : జల్సాలకు అలవాటు పడి ఈజీగా డబ్బు సంపాదించాలని ఆలోచనతో గంజాయిని విక్రయిస్తున్న ఏడుగురిని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి నాలుగు బైకులు, మూడు కేజీల గంజాయిని సీజ్ చేసినట్లు గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి తెలిపారు. జగదేవ్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో సీఐ వివరాలను వెల్లడించారు. బుధవారం ఎస్‌ఐ చంద్రమోహన్ తన సిబ్బందితో కలిసి జగదేవ్‌పూర్ సమీపంలోని కాలువ వద్ద పెట్రోలింగ్ చేస్తున్నాడు. ఆ సమయంలో మునిగడప గ్రామానికి చెందిన పల్లెపాటి వెంకటేష్ ద్విచక్ర వాహనాన్ని వదిలి పారిపోయాడు. ద్విచక్ర వాహనంలో కేజీ 300 గ్రాముల గంజాయి లభించింది. వెంకటేష్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా మరో యువకుడు జశ్వంత్ వద్ద కేజీ గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. జశ్వంత్ చేర్యాల మండలం, పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన అరవింద్, ప్రేమ్‌రాజులకు గంజాయిని విక్రయించగా, బాలకిషన్, సంపత్ అనే ఇద్దరు యువకులు గంజాయి తాగుతూ పోలీసులకు కనిపించగా వారిని కూడా అదుపులోకి తీసుకున్నారు. హైదరాబాద్‌లోని బాలాజీనగర్‌కు చెందిన కోహెడ వెంకటేష్, మునిగడపకు చెందిన పల్లెపాటి వెంకటేష్ ఇద్దరు భద్రాచలం నుంచి గంజాయిని తీసుకువచ్చి గ్రామాలలో యువకులకు విక్రయిస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. ఏడుగురు యువకుల నుంచి మూడు కేజీల గంజాయి, నాలుగు బైకులు, రూ.2000 నగదుతో పాటు నాలుగు మొబైల్‌ఫోన్‌లు పోలీసులు స్వాధీనం చేసుకుని ఏడుగురు నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్ రెడ్డి తెలిపారు. ఈ సమావేశంలో ఎస్‌ఐ చంద్రమోహన్, ఏఎస్‌ఐ రమణారెడ్డి, హెడ్‌కానిస్టేబుల్ జనార్దన్, తాజుద్దీన్, లింగం, శశికాంత్ తదితరులు ఉన్నారు.

బీహెచ్‌ఈఎల్ కార్మికుడి ఆత్మహత్య



అర్జున్‌రావు(ఫైల్)

రామచంద్రాపురం, ఆగస్టు 29 : భార్య దూరమడాన్ని భరించలేక బీహెచ్‌ఈఎల్ కార్మికుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన కొల్లూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నది. సీఐ రవీందర్ కథనం ప్రకారం... సత్యహనుమా అర్జున్‌రావు(39) బెల్ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. అర్జున్‌రావు చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోయాడు. 2015లో అర్జున్‌రావు వివాహం జరిగింది. కుటుంబంలోని చిన్నచిన్న తగాదాలతో భార్య విడాకులు తీసుకుంది. దీంతో అర్జున్‌రావు ఒంటరి జీవితాన్ని గడుపుతున్నాడు. రెండురోజుల క్రితం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గురువారం అర్జున్‌రావు ఇంట్లోంచి వాసన రావడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. తలుపులు బద్దలు కొట్టుకుని ఇంట్లోకి వెళ్లి చూడగా ఫ్యాన్‌కు వేలాడుతున్న అర్జున్‌రావు మృతదేహం కనిపించింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారని సీఐ పేర్కొన్నారు.

అనుమతి లేకుండా మట్టి తరలిస్తున్న వాహనాలు సీజ్

● ఆరుగురిపై కేసు నమోదు

నంగునూరు, ఆగస్టు 29 : ప్రభుత్వం అనుమతి లేకుండా మట్టిని తవ్వి అక్రమ వ్యాపారం చేస్తున్న నాలుగు టిప్పర్లను, ఒక ఎక్స్‌కవేటర్, ఒక హిటాచిని సిద్దిపేట టాస్క్‌ఫోర్స్, రాజగోపాలపేట పోలీసుల సంయుక్త ఆధ్వర్యంలో దాడులు చేసి పట్టుకున్నట్లు ఎస్‌ఐ మహ్మద్ ఆసిఫ్ తెలిపారు. నంగునూరు మండలం ముండ్రాయి శివారులో అక్రమంగా మట్టిని తవ్వి టిప్పర్లల్లో నింపుకుని దండ్ల కనకయ్య, బత్తుల అశోక్, బోదాస్ విష్ణు, శివరాత్రి మహేష్, దండ్ల మధు, రాంకుమార్ కలిసి తరలిస్తున్నారని నమ్మదగిన సమాచారం అందింది. ఈ మేరకు వాహనాలను పట్టుకుని సీజ్ చేయగా, ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అనుమతి లేకుండా తరలిస్తున్న మట్టి దందాపై ఆర్డీవోకు సమాచారం అందించినట్లు తెలిపారు.



పట్టుకున్న నిందితులను, టిప్పర్లను చూపిస్తున్న పోలీసులు

మర్పడగ క్షేత్రంలో ఘనంగా ఆర్ద్రా మహోత్సవం



విజయదుర్గా సమేత మల్లికార్జున స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న పూజలు

కొండపాక, ఆగస్టు 29 : కొండపాక మండలం మర్పడగ విజయదుర్గాసమేత సంతానమల్లికార్జునస్వామి క్షేత్రంలో గురువారం ఆర్ద్రా మహోత్సవం వైభవోపేతంగా నిర్వహించారు. క్షేత్ర నిర్వాహకుడు డాక్టర్ చెప్పెల హరినాథ్ శర్మ ఆధ్వర్యంలో గణపతి పూజ, స్వస్తి వచనంతో కార్యక్రమాలు ప్రారంభం కాగా రుద్రకలశ స్థాపన, నవగ్రహ, దిక్పాలక స్థాపన పూజ నిర్వహించారు. అనంతరం సంతాన మల్లికార్జునస్వామి వారికి మహన్యాస పూర్వక విశేష పంచామృత అభిషేకం, అన్నపూజ, సంతాన పాశుపత అభిషేకం నిర్వహించారు. అనంతరం నవగ్రహహవనం జరిగింది. పూర్ణాహుతి పూర్తయిన తర్వాత భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమాల్లో క్షేత్ర నిర్వహణ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

వేపచెట్టు అంజన్న సన్నిధికి వార్షికోత్సవ శోభ



విశేష అలంకరణలో అంజన్న

కుకునూరుపల్లి, ఆగస్టు 29 : మండల కేంద్రంలోని వేపచెట్టు ఆంజనేయస్వామి ఆలయ ఆరో వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గురువారం స్వామివారికి అభిషేకం చేసి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయానికి గ్రామ ప్రజలు భారీగా తరలివచ్చారు. ఆలయ నిర్వహక కమిటీ భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టింది. ముఖ్య అతిథులుగా జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు కాసం నవీన్‌కుమార్ హాజరయ్యారు.

మారనున్న జహీరాబాద్ రూపురేఖలు

● ఎంపీ సురేష్‌కుమార్‌షెట్కార్



కల్యాణలక్ష్మి చెక్కును పంపిణీ చేస్తున్న ఎంపీ సురేష్‌కుమార్, ఎమ్మెల్యే మాణిక్‌రావు తదితరులు

జహీరాబాద్, ఆగస్టు 29 : నిమ్జ్, స్మార్ట్‌సిటీతో భవిష్యత్తులో జహీరాబాద్ రూపురేఖలు మారనున్నాయని ఎంపీ ఎంపీ సురేష్‌కుమార్‌షెట్కార్ అన్నారు. గురువారం పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నియోజకవర్గంలోని ఆయా మండలాలకు చెందిన పలువురు లబ్ధిదారులకు కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ఈ ప్రాంత అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా కృషి చేస్తుందన్నారు. జహీరాబాద్ ప్రాంతం పారిశ్రామికంగా మరింత అభివృద్ధి చెందనుందని, దీంతో ఈ ప్రాంతంలోని అందరికీ ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తామయన్నారు. పేదింటి కుటుంబాలకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకం దోహదపడుతుందన్నారు. ప్రజలు ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో చెక్కుల పంపిణీ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాణిక్‌రావు మాట్లాడుతూ ప్రభుత్వం అందజేసే అభివృద్ధి, సంక్షేమ ఫలాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, మాజీ మంత్రి డా.చంద్రశేఖర్, ఆర్డీవో రాజు, ఆయా మండలాలకు చెందిన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రేపు వాగుగడ్డ హనుమాన్ జాతర

ప్రతీ యేటా శ్రావణమాసం చివరి శనివారం ఉత్సవాలు.. ఏర్పాట్లు పూర్తి



ఏడిగడ్డకిష్టాపూర్ వాగుగడ్డ హనుమాన్ ఆలయంలో పూజలు చేస్తున్న అర్చకులు

తొగుట, ఆగస్టు 29: మండలంలోని ఏటిగడ్డకిష్టాపూర్ వాగుగడ్డ హన్‌మాన్ ఆలయం జాతరకు ముస్తాబైంది. ప్రతీ ఏడాది శ్రావణమాసం చివరి శనివారం రోజున ఇక్కడ జాతర నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. కూడవెల్లి వాగు పక్కనే చాలా ఏళ్ల క్రితం ఆలయం నిర్మాణం చేపట్టారు. ఇటీవల మల్లన్నసాగర్ రిజర్వాయర్‌లో ఏటిగడ్డకిష్టాపూర్ ఊరు మొత్తం ముంపునకు గురైనప్పటికీ ఆలయం మాత్రం అలాగే ఉండటం గమనార్హం. ఈ ఆలయానికి వచ్చిన భక్తులు కూడవెల్లి వాగులో స్నానం చేసి దేవుడి చుట్టూ ప్రదక్షిణలు చేసి పూజలు చేస్తే కోరిన కోర్కెలు తప్పక నెరవేరుతాయని భక్తుల్లో అపార నమ్మకం. దాంతో ప్రతి ఏడు శ్రావణ మాసం చివరిరోజున ఆలయం వద్ద జాతర జరుపడంతో పాటు ఆలయం చుట్టూ ఎడ్లబండ్లు, ట్రాక్టర్‌లు, వాహనాలను తిప్పడంతో సందడి నెలకొంటుంది. హన్‌మాన్ జాతర కోసం గజ్వేల్, సిద్దిపేట, దౌల్తాబాద్, మిరుదొడ్డి, కొండపాక మండలాల గ్రామాల నుంచి వేలాది మంది భక్తులు తరలిరానున్నారు. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా గ్రామ పంచాయితీ తరఫున అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ప్రధాన అర్చకులు దాతారు రవీందర్ తెలిపారు.

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ రసాభాస

● కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీ శ్రేణుల పోటాపోటీ నినాదాలు
● మెదక్ జిల్లా హత్నూరలో ఉద్రిక్తత



గందరగోళం మధ్య చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

హత్నూర, ఆగస్టు 29: మెదక్ జిల్లా హత్నూరలో గురువారం ఏర్పాటు చేసిన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమం రసాభాసగా మారింది. హత్నూర మండలంలోని పలు గ్రామాలకు చెందిన 197 మంది లబ్ధిదారులకు ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి అధికారులతో కలిసి చెక్కులు పంపిణీ చేస్తున్నారు. అంతలోనే కొందరు బీఆర్‌ఎస్ నాయకులు స్టేజ్ పైకి ఎక్కడంతో కాంగ్రెస్, బీజేపీ నాయకులు అభ్యంతరం వ్యక్తం చేశారు. అధికారిక కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు పెత్తనం ఏమిటని ప్రశ్నించారు. మెదక్ ఎంపీ రఘునందన్‌రావుకు ఎందుకు సమాచారం ఇవ్వలేదని బీజేపీ నాయకులు అధికారులను నిలదీశారు. కాంగ్రెస్, బీజేపీ నాయకులు బీఆర్‌ఎస్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో బీఆర్‌ఎస్ నాయకులు సునీతాలక్ష్మారెడ్డి నాయకత్వం వర్ధిల్లాలి, బీఆర్‌ఎస్ జిందాబాద్ అంటూ ప్రతి నినాదాలు చేశారు. దీంతో ఒక్కసారిగా ఉద్రిక్తత నెలకొంది. ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి, పోలీసులు ఇరువురికి నచ్చజెప్పే ప్రయత్నం చేసినా.. ఫలితం లేకుండా పోయింది. గందరగోళ పరిస్థితుల మధ్యనే సునీతాలక్ష్మారెడ్డి లబ్ధిదారులకు షాదీ ముబారక్, కళ్యాణలక్ష్మి చెక్కులతో పాటు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి మాట్లాడుతూ అభివృద్ధి కార్యక్రమాలలో రాజకీయాలకు తావివ్వకుండా ప్రోటోకాల్‌కు లోబడి పని చేయడం తమ అభిమతమని పేర్కొన్నారు. కొందరు కావాలనే రాజకీయాలు చేస్తూ రాద్ధాంతం చేయడం సరైంది కాదన్నారు. కాంగ్రెస్ మైనార్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శి ఎంఏ హకీమ్, మండల అధ్యక్షుడు కృష్ణ మాట్లాడుతూ అధికారిక కార్యక్రమాల్లో బీఆర్‌ఎస్ నాయకులు పెత్తనం చేస్తున్నారని మండిపడ్డారు. బీజేపీ మండల అధ్యక్షుడు నాగప్రభు గౌడ్ మాట్లాడుతూ మెదక్ ఎంపీ రఘునందన్‌రావుకు సమాచారం ఇవ్వకుండా అధికారులు తొత్తులుగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు.



ఘనంగా తెలుగు భాషా దినోత్సవం

మండల కేంద్రమైన వెల్దుర్తిలోని భాష్యం విద్యామందిర్‌లో గురువారం తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా విద్యార్థులు తెలుగు భాషా అక్షరాలతో కూర్చొన్నారు.

- వెల్దుర్తి

నాణ్యత పరిశీలించి సరుకులు తీసుకోవాలి

● మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క



వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొన్న డీడబ్ల్యూవో లలిత, సీడీపీవో, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు తదితరులు

సంగారెడ్డి రూరల్, ఆగస్టు 29 : జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే సరుకులను నాణ్యతగా ఉన్నాయా లేదా పరిశీలించి తీసుకోవాలని మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. మహిళా శిశు సంక్షేమ శాఖ కమిషనర్ వాకటి కరుణతో కలిసి జిల్లా అధికారులతో హైదరాబాద్ నుంచి గురువారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో సీతక్క మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే కోడిగుడ్లను టీచర్ పరిశీలించి తీసుకోవాలని, బాగాలేని వాటిని తిరిగి పంపించి మంచివి తెప్పించుకోవాలని సూచించారు. సీడీపీవోలు, డీడబ్ల్యూవోలు అంగన్‌వాడీ కేంద్రాలకు సరైన కోడిగుడ్లను పంపిణీ చేయాలన్నారు. లబ్ధిదారులకు పంపిణీ చేసే సరుకులు నాణ్యమైనవి పరిమాణం తక్కువ కాకుండా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాలు, పరిసర ప్రాంతాలు శుభ్రంగా ఉండేలా చూసుకోవాలన్నారు. సెప్టెంబర్‌లో 30 రోజుల పాటు పోషణ మాసం కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో సంగారెడ్డి కలెక్టరేట్ నుంచి డీడబ్ల్యూవో, సీడీపీవో, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు. అనంతరం సంగారెడ్డిలోని మహిళా ప్రాంగణంలో సీడీపీవోలు, కోఆర్డినేటర్లు, సూపర్‌వైజర్లు, హెల్త్ సూపర్‌వైజర్లకు పోషకాహార కార్యక్రమంపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. పోషకాహార లోపం ఉన్న పిల్లల మీద ఎక్కువ దృష్టి సారించి పోషకాహారాన్ని అందించాలని డీడబ్ల్యూవో లలితకుమారి సూచించారు.

స్థానిక ఎన్నికల నిర్వహణకు అధికారులంతా సిద్ధంగా ఉండాలి

● వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ పార్థసారథి



వీడియోకాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మనుచౌదరి

సిద్దిపేట కలెక్టరేట్, ఆగస్టు 29: రాష్ట్రంలో స్థానిక ఎన్నికల నిర్వహణకు.. పోలింగ్ కేంద్రాలు, పోలింగ్ సిబ్బంది ఎంపిక, తుది ఓటరు జాబితా తయారీ ప్రక్రియ పూర్తి చేయాలని, ఎప్పుడు నిర్వహించిన అధికారులంతా సిద్ధంగా ఉండాలని రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ పార్థసారథి అధికారులను ఆదేశించారు. గురువారం హైదరాబాద్ నుంచి సచివాలయంలో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి కార్యదర్శి లోకేష్ కూమార్, కమిషనర్ అనితా రామచంద్రన్‌తో కలిసి ఆయన అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, పంచాయతీ శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... 4-5 నెలల్లో స్థానిక ఎన్నికలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ముందుగా పంచాయతీ, తర్వాత ఎంపీటీసీ, జడ్పీటీసీ, మున్సిపల్ ఎలక్షన్లు నిర్వహించినున్నట్లు తెలిపారు. గ్రామ పంచాయతీల ఓటరు జాబితా తయారీ ప్రక్రియ వేగవంతం చేయాలని సూచించారు. మ్యాన్ పవర్ అధిక సంఖ్యలో అవసరం అవుతుందన్నారు. పోలింగ్ సిబ్బంది, బందోబస్తు కోసం పోలీస్ అధికారులు సైతం ఎక్కువ మొత్తంలో అవసరం ఉంటుందని అంచనా వేశారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియను మండలాల్లో అన్ని ఎంపీడీవో కార్యాలయాల్లో డాట ఎంట్రీ ఆపరేటర్లతో వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాల నుంచి ఎంపిక చేసిన వారికి పోలింగ్ ప్రక్రియపై శిక్షణ ఇస్తామని తెలిపారు. జిల్లా గ్రామ పంచాయతీ అధికారి, పంచాయతీ సెక్రటరీ, ఎంపీడీవో, ఎంపీవో, డీఎల్పీవో, డీపీవో అధికారుల పనీతీరును అదనపు కలెక్టర్ తరచూ పర్యవేక్షించాలని, కలెక్టర్ మానిటరింగ్ చేయాలని ఆయన ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మనుచౌదరి, అదనపు కలెక్టర్ గరీమా అగ్రవాల్, ఆర్డీవో సదానందం, జడ్పీ సీఈవో రమేష్, డీపీవో దేవకీదేవి, డీఎల్పీవోలు, తదితరులు పాల్గొన్నారు.

ఖేడ్‌లో అధునాతన హంగులతో డీసీసీబీ భవనం

● ప్రారంభోత్సవానికి సిద్ధం

నారాయణఖేడ్, ఆగస్టు 29 : నారాయణఖేడ్‌లో నాలుగు దశాబ్దాలుగా వాణిజ్య బ్యాంకులతో సమానంగా జిల్లా కేంద్ర సహకార బ్యాంకు(డీసీసీబీ) సేవలు అందుతున్నాయి. మొన్నటి వరకు బ్యాంకు కార్యకలాపాలు అద్దె భవనాల్లోనే కొనసాగాయి. ఈ ఇబ్బందులకు ఇక చెక్ పడనుంది. ఖేడ్‌లో అధునాతన హంగులతో రూ.కోటి వ్యయంతో భవనాన్ని నిర్మించారు. ఇది ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్నది.

సహకార బ్యాంకు పరిధిలో దాదాపు ఆరు ప్రాథమిక సహకార సంఘాలు ఉన్నాయి. దీనికి తోడు స్వయం సహాయక బృందాలకు లింకే జీరుణాలు ఇస్తుండడంతో, ప్రస్తుతం ఉన్న భవనంలో ఖాతాదారులకు ఇబ్బందులు ఎదురయ్యేవి. దీంతో గత ప్రభుత్వ హయాంలో పాల శీతలీకరణ కేంద్రం ఆవరణలో రైతుబజార్ పక్కన దాదాపు 500 గజాల స్థలాన్ని కేటాయించింది. అధునాతన వసతులతో భవనాన్ని నిర్మించడానికి రూ.కోటి మంజూరు చేయడంతో, తొమ్మిది నెలల క్రితం పనులు ప్రారంభించి, యుద్ధప్రాతిపదికన నిర్మాణం పూర్తిచేశారు. ప్రస్తుతం భవనంలో ఇంటీరియల్ పనులు పూర్తి కావాల్సి ఉంది. ఫర్నిచర్‌ను సమకూర్చాలి. వారం రోజుల్లో ఈ పనులన్ని పూర్తి చేసి, భవనాన్ని ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.



నిర్మాణం పూర్తయిన డీసీసీబీ భవనం

లాకర్ల వసతి.. ఏటీఎం సదుపాయం



నారాయణఖేడ్‌లో ఆధునిక హంగులతో బ్యాంకు భవనాన్ని నిర్మింపజేశాం. ఈ భవనంలో రైతులకు మహిళా సంఘాల వారికి, ఖాతాదారులకు ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేశాం. వాణిజ్య బ్యాంకులకు దీటుగా సేవలు అందిస్తాం. బ్యాంకులో లాకర్ల వసతితో పాటు ఏటీఎం, ఇతర అన్ని సదుపాయాలు అందుబాటులోకి వస్తాయి.

- వెంకటేశ్, బ్యాంకు మేనేజర్


ఖేడ్‌లో 2కే రన్‌ను జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి


సంగారెడ్డిలోని శాంతినగర్ సెయింట్ ఆంథోనీస్‌లో ధ్యాన్ చంద్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పాఠశాల యాజమాన్యం, విద్యార్థులు


తూప్రాన్ మండల స్థాయి ఎస్జీఎఫ్ క్రీడలను ప్రారంభిస్తున్న డీఈవో రాధాకిషన్

విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి

నారాయణఖేడ్, ఆగస్టు 29: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని ఎమ్మెల్యే పట్లోళ్లసంజీవరెడ్డి అన్నారు. ధ్యాన్‌చంద్ జయంతి, జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని పీఈటీల అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక బసవేశ్వర చౌక్ నుంచి నిర్వహించిన 2కే రన్‌ను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం తహసీల్ గ్రౌండ్‌లో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు నిర్వహించిన క్రీడలను ప్రారంభించి.. క్రీడలు ఆడుతూ ఉత్సాహ పరిచారు. 2కే రన్‌లో విజేతలకు బహుమతులు అందజేశారు.

●**సంగారెడ్డి అర్బన్:** సంగారెడ్డిలో హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఐబీ నుంచి ర్యాలీ అంబేడ్కర్ స్టేడియం వరకు నిర్వహించారు. ఈ ర్యాలీని డీఈవో వెంకటేశ్వర్లు, డీవైఎస్‌వో ఖాసీంబేగ్ జ్యోతి వెలిగించి ప్రారంభించారు. అనంతరం జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో అంబేడ్కర్ స్టేడియంలో రెండురోజుల పాటు ఉద్యోగులకు నిర్వహించిన క్రీడా పోటీల విజేతలకు టీఎన్‌జీవోస్ భవన్‌లో బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ అభివృద్ధి అధికారి జగదీశ్, టీఎన్‌జీవో అధ్యక్షుడు జావిద్‌అలీ, సోషల్ వెల్ఫేర్ డీడీ అఖిలేష్‌రెడ్డి, టీజీవో జిల్లా అధ్యక్షుడు వైద్యనాథ్, హాకీ సెక్రటరీ రఘునందన్‌రెడ్డి, వసతిగృహ సంక్షేమాధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గౌస్, కోచ్, పీఈటీ, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అలాగే సంగారెడ్డిలోని శాంతినగర్ సెయింట్ ఆంథోనీస్‌లో తెలుగు భాష, క్రీడా దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులకు వివిధరకాలైన ఆటల పోటీలు నిర్వహించి, గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. విద్యాసంస్థల అధినేత సోలోమోన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ కరుణాకర్‌రెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ హెడ్ జయబాలరెడ్డి, పాఠశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

●**కల్హేర్:** జాతీయ క్రీడా దినోత్సవాన్ని మండల కేంద్రమైన సిర్గాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం నాగారం శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మెదక్ జిల్లాలో

తూప్రాన్, ఆగస్టు 29: గొప్ప క్రీడాకారులను తయారు చేయడానికి జిల్లాలోని ప్రతి పాఠశాలలో ఆటలు ఆడించేందుకు సమయాన్ని కేటాయించాలని జిల్లా విద్యాధికారి రాధాకిషన్ సూచించారు. గురువారం తూప్రాన్ పట్టణ పరిధి అల్లాపూర్ శివారులో టోల్‌ప్లాజా వద్దగల గురుకులంలో మండల స్థాయి స్కూల్ గేమ్ ఫెడరేషన్ క్రీడల ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. జీఎంఆర్ పోచంపల్లి ఎక్స్‌ప్రెస్ హైవేస్ ప్రాజెక్టు మేనేజర్ వెంకటరమణ, లక్ష్మణ్‌రావు, ఎంఈవో బుచ్చానాయక్, స్కూల్ గేమ్స్ ఆఫ్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి రమేష్, గురుకుల ప్రిన్సిపాల్ మురళి పాల్గొన్నారు.

●**మెదక్ అర్బన్:** ధ్యాన్ చంద్ జయంతి సందర్భంగా మెదక్ పట్టణంలోని సిద్ధార్థ్ విద్యాసంస్థలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిద్ధార్థ్ విద్యాసంస్థల చైర్మన్ శ్రీనివాస్‌చౌదరి, ప్రిన్సిపాల్ సంధ్యారాణి మాట్లాడారు. అనంతరం క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అలాగే ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా జాతీయ క్రీడా దినోత్సవాన్ని గురువారం ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తపస్ జిల్లా అధ్యక్షుడు జిడ్డి ఎల్లం, నాయకులు చల్లా లక్ష్మణ్, నర్సింహులు, సత్యనారాయణ, నరేందర్, కృష్ణమూర్తి, వ్యాయామ ఉపాధ్యాయులు మాధవరెడ్డి, దేవేందర్‌రెడ్డి, మధు, ఏవి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

●**చిన్నశంకరంపేట:** ధ్యాన్ చంద్ జయంతి సందర్భంగా చిన్నశంకరంపేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల గ్రౌండ్‌లో మండలస్థాయి ఎస్జీఎఫ్ క్రీడలను పలు పాఠశాలలకు సంబంధించిన ప్రధానోపాధ్యాయులతో కలిసి ఎస్‌ఐ నారాయణ, ఎంపీడీవో దామోదర్ గురువారం ప్రారంభించారు.


మెదక్ అర్బన్: విద్యార్థినులకు బహుమతులు అందజేస్తున్న సిద్ధార్థ్ విద్యాసంస్థల చైర్మన్ శ్రీనివాస్‌చౌదరి

30, 31 తేదీల్లో ఎస్జీఎఫ్ క్రీడలు

నిజాంపేట: మండల కేంద్రమైన నిజాంపేటలో ఈనెల 30, 31 తేదీల్లో ఎస్జీఎఫ్ క్రీడా పోటీలను జడ్పీ పాఠశాల క్రీడా ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు ఎంఈవో విశ్వనాథ్ తెలిపారు. అండర్-14, అండర్-17 బాల బాలికలు పాల్గొనాలని కోరారు. ఈ పోటీలను పీడీలు విఠల్‌నాయక్, రాజలింగం ఆధ్వర్యంలో నిర్వహిస్తామన్నారు.

సెప్టెంబరు 2న ఎస్జీఎఫ్ క్రీడలు


చేగుంట, ఆగస్టు 29: చేగుంటలో సెప్టెంబరు 2 నుంచి 4 వరకు మండల స్థాయి ఎస్జీఎఫ్ క్రీడలు నిర్వహిస్తున్నట్లు పీడీ శారద పేర్కొన్నారు. కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, అండర్-14, 17 బాలికలకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వడియారంలో, అండర్-14, 17 బాలురకు తెలంగాణ మోడల్ స్కూల్‌లో క్రీడలు నిర్వహిస్తున్నట్లు పీడీ శారద తెలిపారు. ఈ సమావేశంలో పీడీలు, నాగరాజు, మంజుల, శంకర్, వెంకటేశం పాల్గొన్నారు.

చేగుంటలో యువకుడి అదృశ్యం


అసిఫ్ (ఫైల్)

చేగుంట, ఆగస్టు 29: యువకుడు అదృశ్యమైన సంఘటన చేగుంట మండల కేంద్రంలో గురువారం చోటు చేసుకున్నది. ఎస్‌ఐ చైతన్యకుమార్‌రెడ్డి వివరాల ప్రకారం.. చేగుంట గ్రామానికి చెందిన షేక్ అసిఫ్(37) రైల్వేశాఖలో జూనియర్ క్లర్క్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. మంగళవారం ఉదయం 10 గంటలకు ఆరోగ్యం బాగాలేకపోవడంతో హైదరాబాద్‌లోని నాంపల్లి రైల్వే ఆస్పత్రిలో మందులు తెచ్చుకుంటానని ఇంట్లో చెప్పి వెళ్లి, తిరిగిరాలేదు. ఆందోళన చెందిన కుటుంబసభ్యులు ఫోన్‌చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో భార్య సిరీన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం


గుర్తు తెలియని మృతదేహం

రామచంద్రాపురం, ఆగస్టు 29: ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణం వద్ద ఓ గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహాన్ని రామచంద్రాపురం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సీఐ జగన్నాథ్ కథనం ప్రకారం... చందానగర్ నుంచి రామచంద్రాపురం జ్యోతినగర్ వరకు నిర్మిస్తున్న ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద ఓ మృతదేహం పడి ఉన్నట్టు స్థానికులు గుర్తించారు. విషయాన్ని పోలీసులకు తెలపడంతో వారు వచ్చి మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. మృతుడి వయస్సు 60-65 మధ్య ఉంటుందని, కుడిచేతిపై లవ్ సింబల్ ట్యాటు ఉన్నట్టు పోలీసులు గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు రామచంద్రాపురం పోలీసులను సంప్రదించాలని సీఐ కోరారు.

తాళాలు వేసిన ఇంట్లో చోరీ

రామాయంపేట, ఆగస్టు 29: పట్టణంలోని డబుల్ ఇళ్లలో దొంగలు బీభత్సం సృష్టించారు. ఎనిమిది ఇళ్ల తాళాలు పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. ఏడాది క్రితం ఇక్కడ స్థిరపడ్డ కుటుంబాలు శుక్రవారం వివాహ శుభ కార్యక్రమాలకు వెళ్లారు. ఇదే అదునుగా భావించిన దొంగలు చోరీకి పాల్పడ్డారు. సమాచారం తెలుసుకున్న సీఐ, ఎస్‌ఐలు ఘటనా స్థలానికి చేరుకుని, క్లూస్‌టీంను రప్పించి వివరాలు సేకరించే పనిలో పడ్డారు.

పాఠశాలకు క్రీడా సామగ్రి బహూకరణ

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 29: సంగారెడ్డిలోని ప్రభుత్వ నూతన ఉన్నత పాఠశాల(జీఎన్‌హెచ్‌ఎస్)కు లయన్స్ క్లబ్ ఆఫ్ సంగారెడ్డి ఆదర్శ సభ్యుడు జూలకంటి ప్రభాకర్ దాతృత్వంతో క్రీడా సామగ్రిని బహూకరించారు. జాతీయ క్రీడా దినోత్సవం పురస్కరించుకొని పాఠశాల విద్యార్థుల సౌకర్యార్థం రూ.10 వేల విలువ చేసే క్రీడా పరికరాలను అందజేశారు. ఈ సందర్భంగా జోన్ చైర్మన్ ఎం.వెంకటేశం, దాత ప్రభాకర్ మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ పాఠశాలకు మున్ముందు మరిన్ని సహాయ సహకారాలు అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ సంగారెడ్డి ఆదర్శ అధ్యక్షుడు జార్జ్, కార్యదర్శి రామప్ప పాల్గొన్నారు.


జీఎన్‌హెచ్‌ఎస్‌కు క్రీడా సామగ్రిని బహూకరిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

'ఎల్‌ఆర్‌ఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలి'

నారాయణఖేడ్, ఆగస్టు 29: ఎల్‌ఆర్‌ఎస్‌ను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్ కోరారు. గురువారం మున్సిపల్ పరిధిలో ఎల్ఆర్ఎస్‌లో భాగంగా దరఖాస్తుదారుల గృహాల స్థలాలను సందర్శించి, వివరాల నమోదు ప్రక్రియను ప్రారంభించి మాట్లాడారు. ఖేడ్ మున్సిపల్ పరిధిలో ఎల్‌ఆర్‌ఎస్‌లో భాగంగా గృహాల స్థలాలకు సంబంధించి 3,848, లే అవుట్లకు సంబంధించి 74 దరఖాస్తులు వచ్చాయన్నారు. ఆయన వెంట టౌన్‌ప్లానింగ్ అధికారి కరుణాకర్, నీటిపారుదల శాఖ ఏఈ ప్రతిభ, ఆర్ఐ మాధవరెడ్డి పాల్గొన్నారు.

వీధి వ్యాపారులకు అండగా ఉంటాం: ఎంఐఎం

నారాయణఖేడ్, ఆగస్టు 29: ఖేడ్ మున్సిపల్ పరిధిలోని వీధివ్యాపారులకు తాము అండగా ఉంటామని ఎంఐఎం నియోజకవర్గ అధ్యక్షుడు మోహీద్‌పటేల్ అన్నారు. గురువారం నారాయణఖేడ్‌లోని ఎంఐఎం కార్యాలయంలో వీధి, పండ్ల వ్యాపారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ఖేడ్‌లో పండ్ల వ్యాపారుల కోసం ప్రత్యేకంగా మార్కెట్ లేకపోవడంతో తాము తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నామని, వెంటనే మార్కెట్‌ను ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం వీధి, పండ్ల వ్యాపారుల కార్యవర్గాన్ని ఏర్పాటు చేసుకున్నారు.

అసైన్డ్ భూముల అమ్మకాలను అడ్డుకోవాలి

● **తహసీల్దార్‌కు రాళ్లకత్వ వాసుల వినతి**

జిన్నారం, ఆగస్టు 29: జిన్నారం మండలం రాళ్లకత్వ, సోలక్‌పల్లి శివారులోని 286 సర్వే నెంబర్‌లో కొందరు అసైన్డ్ భూములు అమ్ముకుంటున్నారని, వారిని గుర్తించి రెవెన్యూ రికార్డుల నుంచి తొలగించాలని రాళ్లకత్వ గ్రామ నాయకులు తహసీల్దార్ భిక్షపతికి గురువారం ఫిర్యాదు చేశారు. స్థానిక 286 సర్వే నంబరులో ప్రభుత్వం పేదలకు అసైన్డ్ భూములు కేటాయించగా.. ఇటీవల కొందరు స్టోన్ క్రషర్ల కోసం విక్రయాలు, లీజుకు ఇవ్వటం చేస్తున్నారని, చట్టప్రకారం అసైన్డ్ భూముల్లో వ్యాపార కార్యకలాపాలు చేయరాదని తెలిపారు. అక్రమాలకు పాల్పడుతున్న వారిని గుర్తించి అసైన్డ్ రద్దుతో పాటు రెవెన్యూ రికార్డుల నుంచి వారిని తొలగించాలని కోరారు.

సమాచారం

ప్రత్యేక అధికారుల మార్పు

నారాయణఖేడ్: నారాయణఖేడ్ మండలంలోని గ్రామపంచాయతీలకు ప్రత్యేక అధికారులను మార్చి బాధ్యతలు స్వీకరించాలని కలెక్టర్ కార్యాలయం ఉత్తర్వులు జారీచేసింది. సర్పంచుల పదవీకాలం పూర్తవడంతో నారాయణఖేడ్ మండలంలో వివిధశాఖలకు చెందిన అధికారులను ప్రత్యేక అధికారులుగా నియమించారు. కొన్ని శాఖల అధికారులు బదిలీలు కావడంతో వారి స్థానంలో కొత్త అధికారులను గ్రామపంచాయతీలకు, ప్రత్యేక అధికారులుగా నియమిస్తూ కలెక్టర్ కార్యాలయం ఉత్తర్వులు జారీచేసింది.

బొల్లారంలో కుంట కబ్జాలపై హైడ్రాకు ఫిర్యాదు

జిన్నారం: బొల్లారం మున్సిపాలిటీలో పలు చెరువు, కుంటల్లో ఆక్రమణలు జరిగాయని బీజేపీ నాయకులు బీజేపీ జిల్లా నాయకుడు రాఘవేందర్‌రెడ్డి హైదరాబాద్ బుద్ధ భవన్‌లో ఉన్న హైడ్రా కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. బొల్లారంలో 20 ఏళ్లలో పలు చెరువులు, కుంటలను పరిశ్రమలు, ప్రైవేటు వ్యక్తులు కబ్జాలు చేశారని, బఫర్, ఎఫ్‌టీఎల్‌లో నిర్మాణాలు జరిగాయని విచారణ జరిపి చర్యలు చేపట్టాలని కోరారు.

ఆయుర్వేద వైద్య శిబిరం విజయవంతం

మాసాయిపేట, ఆగస్టు 29: మండల కేంద్రమైన మాసాయిపేటలోని వృద్ధుల కోసం గురువారం నిర్వహించిన ఆయుర్వేద వైద్య శిబిరం విజయవంతమైంది. ఈ శిబిరంలో వృద్ధులు, మహిళలు, రైతులకు ఆయుర్వేద ఆస్పత్రి డాక్టర్ పాకాల శ్రీదేవి ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి జ్ఞానజ్యోతి, ఆయుర్వేద ఆస్పత్రి డాక్టర్లు కె.శ్రీనివాసరావు, అనిల్‌కుమార్, మహబూబ్ అలీ, సిబ్బంది పాల్గొన్నారు.

'బిల్లులను విడుదల చేయాలి'

మునిపల్లి, ఆగస్టు 29: పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయడంతో పాటు పీఆర్సీని ప్రకటించాలని టీపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ సోమశేఖర్, మండల అధ్యక్షుడు లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి గోపాల్ అన్నారు. గురువారం మండల పరిధిలోని కంకోల్, అంతారం, పెద్దచెల్మెడ, మేళాసంగం, తాటిపల్లి, లోనికలాన్ తదితర గ్రామాల్లో టీపీఎఫ్ సభ్యత్వ నమోదు నిర్వహించారు.

నేడు స్పాట్ అడ్మిషన్లు

కల్హేర్, ఆగస్టు 29: సిర్గాపూర్ మండల పరిధిలోని సుల్తానాబాద్(నల్లవాగు) సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో మొదటి సంవత్సరం బైపీసీ, ఎంపీసీ గ్రూపుల్లో అడ్మిషన్ కోసం ఈనెల 30న స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ తిరుపతయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి నిర్వహించబోయే ఈ స్పాట్ అడ్మిషన్లలో పాల్గొనే విద్యార్థులు పూర్తి ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని ప్రిన్సిపాల్ సూచించారు.

నేడు డయల్ యువర్ ఏటీఎం

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 29: డయల్ యువర్ ఏటీఎం(టీజీఎస్ ఆర్టీసీ లాజిస్టిక్స్) కార్యక్రమాన్ని ఈ నెల 30న నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఇస్సాక్‌బిన్ మహ్మద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని కార్గో వినియోగదారులు ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు పార్సిల్ కార్గో ఫిర్యాదుల కోసం 8125456978 నంబరుకు ఫోన్ చేయాలని సూచించారు.

సంఘం భవనాన్ని నిర్మించడం మంచి నిర్ణయం

● **టీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి**

కొండాపూర్, ఆగస్టు 29: సంఘం భవనాన్ని నిర్మించడం మంచి నిర్ణయమని తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి పేర్కొన్నారు. గురువారం గొల్లపల్లిలో గౌడ సంఘం భవన శంకుస్థాపనకు ఆమె హాజరై మాట్లాడారు. కులసంఘం ఐక్యంగా నడిచేందుకు భవన నిర్మాణం చేపట్టడం మంచి పరిణామమన్నారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు అశన్నగౌడ్, కార్యదర్శి రమేష్‌గౌడ్, సంగారెడ్డి ఆత్మ కమిటీ చైర్మన్ ప్రభు, సదాశివపేట మార్కెట్ కమిటీ చైర్మన్ కుమార్, స్థానిక ఎమ్మెల్యే తనయుడు సాయినాథ్, సొసైటీ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి,మాజీ ఎంపీపీలు, మాజీ సర్పంచులు, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు. అలాగే ప్రభుత్వ ఆయుష్ శాఖ(ఆయుర్వేద హోమియో, యునాని) తెలంగాణ ప్రభుత్వం వృద్ధాప్య మెగా వైద్య శిబిరాన్ని మల్కాపూర్‌లో గురువారం ఏర్పాటు చేశారు. ఈ శిబిరానికి నిర్మలాజగ్గారెడ్డి హాజరై మాట్లాడారు. గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో రత్నవేణి, ఎంపీవో శ్రీనివాస్, గ్రామ కార్యదర్శి మన్‌మోహన్‌సింగ్, డాక్టర్ అఖిల, సుశీల, తదితరులు పాల్గొన్నారు.


గొల్లపల్లి గౌడ సంఘం భవన శంకుస్థాపనకు హాజరైన నిర్మలాజగ్గారెడ్డి, తదితరులు

ప్రజా సమస్యల పరిష్కారానికి పెద్దపీట: ఎమ్మెల్యే

కల్హేర్, ఆగస్టు 29: కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ముందుగా ప్రజలు ఎదుర్కొంటున్న విద్య, వైద్యం, ఉపాధి వంటి సమస్యలను పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటున్నామని నారాయణఖేడ్ ఎమ్మెల్యే పి.సంజీవరెడ్డి అన్నారు. మండల కేంద్రమైన సిర్గాపూర్‌లో గురువారం కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేసిన అనంతరం.. ఎస్జీఎఫ్ క్రీడల్లో విజయం సాధించిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. మండల పరిధిలోని అంతర్గాంలో నారాయణఖేడ్ నుంచి కామారెడ్డి జిల్లా పిట్లం మండల కేంద్రానికి ఆర్టీసీ బస్సును గజేంద్ర ఆశ్రమ పీఠాధిపతి కరణ్ మహరాజ్‌తో కలిసి ప్రారంభించారు. మండల కేంద్రమైన కల్హేర్‌లోని కమ్యూనిటీ ఆస్పత్రిలో సీఎస్ఆర్ నిధులతో ఏర్పాటు చేసిన అంబులెన్స్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం జరిగిన సభల్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు రేషన్‌కార్డులు లేక ఇబ్బందుల పాలవుతున్నారని, అలాగే ప్రజలకు నాణ్యమైన ఉచిత వైద్యం పకడ్బందీగా అందించడం కోసం సెప్టెంబరు 17 నుంచి 10 రోజుల పాటు ప్రజా పాలన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమాల్లో సీడీసీ మాజీ చైర్మన్ నర్సింహారెడ్డి, మాజీ ఎంపీపీ మల్లేశం, మాజీ ఎంపీటీసీలు, మాజీ ప్యాక్స్ చైర్మన్లు, నాయకులు పాల్గొన్నారు.

తెలంగాణ అభివృద్ధికి మోదీ సర్కారు కట్టుబడి ఉంది

● **బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరిఅంజిరెడ్డి**

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 29: తెలంగాణ అభివృద్ధికి మోదీ సర్కారు కట్టుబడి ఉందని, ఇందుకు జహీరాబాద్‌లో ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ మంజూరే నిదర్శనమని బీజేపీ సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు గోదావరిఅంజిరెడ్డి అన్నారు. సంగారెడ్డి చౌరస్తాలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దేశవ్యాప్తంగా 10 రాష్ట్రాల్లో 12 ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీల ఎంపికలో తెలంగాణలోని సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ ప్రాంతానికి దక్కడం గర్వించదగ్గ విషయమన్నారు. స్మార్ట్ సిటీల ఏర్పాటుతో రానున్న రోజుల్లో సుమారు 2 లక్షల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు దక్కే అవకాశం ఉంటుందన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు పోచారం రాములు, ప్రధాన కార్యదర్శి అనంతరావుకులకర్ణి, కార్యదర్శి నాగరాజు, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ నర్సారెడ్డి పాల్గొన్నారు. జహీరాబాద్‌లో ఇండస్ట్రియల్ సిటీ ఏర్పాటుపై బీఎంఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రదీప్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు నరసింహారెడ్డి, కార్యదర్శి మోహన్‌రెడ్డిలు ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు.


సమావేశంలో మాట్లాడుతున్న గోదావరిఅంజిరెడ్డి

యువత అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలి: డేనియల్

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 29: యువత అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి డేనియల్ సూచించారు. సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో తెలంగాణ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ వారి సహకారంతో జిల్లాస్థాయి రెడ్ రిబ్బన్ క్లబ్ కార్యక్రమంలో భాగంగా ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎయిడ్స్ అంటు వ్యాధి కాదని, ఎయిడ్స్ వ్యాధికి మందులేదని, నివారణ ఒక్కటే మార్గమన్నారు. తెలంగాణలో ఎయిడ్స్ వ్యాధి అధికంగా ఉన్న రోగుల్లో సంగారెడ్డి జిల్లా ఒకటని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. అంతకుముందు ప్రిన్సిపాల్ రత్నప్రసాద్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డా.మల్లిక, వైస్ ప్రిన్సిపాల్ జగదీశ్వర్, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఎస్జీఎఫ్ క్రీడలు

పుల్కల్, ఆగస్టు 29: ఉమ్మడి పుల్కల్ మండలంలో రెండురోజులుగా కొనసాగుతున్న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడోత్సవాలు గురువారం ముగిశాయి. బుధవారం అండర్-14, 17 విభాగాల్లో బాలికలకు క్రీడలు నిర్వహించగా, గురువారం అండర్-14, 17 విభాగంలో బాలురకు నిర్వహించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్థాయిలో జరిగిన ఈ క్రీడలను పుల్కల్ మండలానికి చెందిన వివిధ జడ్పీహెచ్ఎస్ బాల, బాలికలకు సింగూరు సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల క్రీడా మైదానంలో, చౌటకూర్ మండలానికి చెందిన జడ్పీహెచ్ఎస్ పాఠశాలల బాల, బాలురకు చౌటకూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహించారు. ఇందులో వాలీబాల్, కబడ్డీ ఫైనల్ పోటీలు నిర్వహించాల్సి ఉండగా, మధ్యాహ్నం నుంచి భారీ వర్షం కురిసింది. దీంతో ఫైనల్ పోటీలను శుక్రవారం నిర్వహించి, విజేతలకు బహుమతులను అందజేయనున్నామని ఎంఈవో వి.శంకర్ తెలిపారు.

సెప్టెంబరు 28న జాతీయ లోక్ అదాలత్

మెదక్ అర్బన్, ఆగస్టు 29: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లా పరిధిలోని అన్ని న్యాయ స్థానాల్లో సెప్టెంబరు 28న జాతీయ లోక్ అదాలత్ జరుగుతుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి లక్ష్మీశారద తెలిపారు. గురువారం మెదక్ కోర్టు ప్రాంగణంలో పోలీసు, ఇతర శాఖ అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ న్యాయ స్థానాల్లో ఉన్న పెండింగ్ కేసులు, సివిల్, చెక్ బౌన్స్, బ్యాంకింగ్, మోటార్ ప్రమాదాల నష్ట పరిహారాల కేసులు, బ్యాంకు మనీ రికవరీ కేసులు, ల్యాండ్ అక్విజిషన్ కేసులు, రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులు పరిష్కారానికి వస్తాయని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి, సీనియర్ సివిల్ జడ్జి జితేందర్, ఆర్డీవో రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ కార్యకర్త సైనికుడిలా పనిచేయాలి

● **బీజేపీ మెదక్ నియోజకవర్గ ఇన్‌చార్జి విజయ్‌కుమార్**

చిన్నశంకరంపేట/పెద్దశంకరంపేట/గుమ్మడిదల/హత్నూర, ఆగస్టు 29: ప్రతి కార్యకర్త సైనికుల్లా పనిచేయాలని బీజేపీ మెదక్ నియోజకవర్గ ఇన్‌చార్జి పంజా విజయ్‌కుమార్ అన్నారు. బీజేపీ మండలాధ్యక్షుడు రాజు ఆధ్వర్యంలో బీజేపీ సభ్యత్వ నమోదులో భాగంగా బూత్ లెవల్ అధ్యక్షులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో అన్ని పార్టీల కంటే అధికంగా బీజేపీకి సభ్యత్వం కలిగి ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు శంకర్, కిసాన్ మోర్చా మండలాధ్యక్షుడు రమేష్, పట్టణ అధ్యక్షుడు ఆకుల రాజు పాల్గొన్నారు. గ్రామీణస్థాయిలో బీజేపీ బలోపేతానికి కృషి చేయాలని బీజేపీ మండలాధ్యక్షుడు కోణం విఠల్ సూచించారు. గురువారం పెద్దశంకరంపేటలోని బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన మండల కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. సభ్యత్వ నమోదును ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు వంగేటి ప్రతాప్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం గుమ్మడిదల పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సభ్యత్వ నమోదుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. హత్నూరలో బీజేపీ మండలాధ్యక్షుడు నాగప్రభుగౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మురళీధర్‌యాదవ్, కొండాపురం జగన్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రఘువీరారెడ్డి, అసెంబ్లీ కో-కన్వీనర్ సతీష్‌యాదవ్ పాల్గొన్నారు.

'సీఎంఆర్‌ఎఫ్' నిరుపేదలకు ఎంతో ఉపయోగం

నర్సాపూర్/నారాయణఖేడ్ ఆగస్టు 29: సీఎంఆర్‌ఎఫ్ నిరుపేదలకు ఎంతగానో ఉపయోగపడుతుందని పీసీసీ ప్రధాన కార్యదర్శి, నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి పేర్కొన్నారు. గురువారం నర్సాపూర్‌లోని తన క్యాంపు కార్యాలయంలో చిలప్‌చెడ్ మండలం అజ్జమర్రి గ్రామానికి చెందిన ఎల్లమ్మకు మంజూరైన రూ.32 వేల సీఎం సహాయనిధి చెక్కును డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్‌తో కలిసి అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు మల్లేశం, శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు. అలాగే నారాయణఖేడ్ మండలం రాణాపూర్‌కు చెందిన బాగయ్యకు రూ.18 వేలు, సిర్గాపూర్ మండలం వాసర్‌కు చెందిన నాందేవ్‌నాయక్ కూతురుకు రూ.12 వేలు, భీమానాయక్‌తండాకు చెందిన రెడ్యానాయక్‌కు రూ.14 వేలు, ఇరక్‌పల్లికి చెందిన మారుతికి రూ.18 వేలు, గౌడ్‌గాంకు చెందిన సంజీవ్‌కు రూ.20 వేల చెక్కులను జిల్లా ప్రణాళిక మండలి మాజీ సభ్యుడు నగేష్‌షెట్కార్ గురువారం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మనూరు మండలాధ్యక్షుడు సుభాష్‌పటేల్ పాల్గొన్నారు.

రుణమాఫీ కాని రైతులు అధైర్యపడొద్దు: డీఏవో

చిలప్‌చెడ్/మెదక్ కల్చరల్/నర్సాపూర్/జహీరాబాద్/వెల్దుర్తి/గుమ్మడిదల, ఆగస్టు 29: రుణమాఫీ కాని రైతులు అధైర్యపడొద్దని, వారికి రుణమాఫీ అయ్యేలా చూస్తానని జిల్లా వ్యవసాయాధికారి గోవింద్ పేర్కొన్నారు. గురువారం మండలం పరిధిలోని చండూరు గ్రామంలో డీఏవో పర్యటించారు. ఈ సందర్భంగా పలువురు రైతుల ఇళ్లకు వెళ్లి.. వివరాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో ఏవో రాజశేఖర్, ఏఈవోలు భూపాల్, రమ్య, రైతులు పాల్గొన్నారు. రెండు లక్షలలోపు రుణమాఫీ కాని రైతుల నిర్ధారణ కోసం చేపట్టిన సర్వేను వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పకడ్బందీగా నిర్వహించాలని వ్యవసాయ సహాయ సంచాలకులు విజయనిర్మల అన్నారు. గురువారం మెదక్ మండల పరిధిలోని మాచవరంలో సర్వేను పరిశీలించారు. నర్సాపూర్ మండలంలోని లింగాపూర్, కాజీపేట, మంతూరు, రెడ్డిపల్లి గ్రామాల్లో మండల వ్యవసాయ అధికారి దీపిక ఇంటింటికి తిరిగి వివరాలు సేకరించి యాప్‌లో నమోదు చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి దుర్గాప్రసాద్, హరీశ్ పాల్గొన్నారు. జహీరాబాద్ మండలంలోని ఆనెగుంటలో రుణమాఫీ కాని రైతుల వివరాలను మండల వ్యవసాయాధికారి లావణ్య సేకరించారు. వెల్దుర్తి మండల పరిధిలోని మంగళపర్తిలో అర్హత ఉండి రుణమాఫీ రైతుల నుంచి మండల వ్యవసాయాధికారి ఝాన్సీ వివరాలు సేకరించారు. మండలంలో 547 మంది రైతులకు రుణమాఫీ జరగలేదని తెలిపారు. గుమ్మడిదల మండలంలోని అనంతారం, వీరారెడ్డిపల్లి గ్రామాల్లో మండల వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో రుణమాఫీ కాని రైతుల ఇంటివద్దకెళ్లి వివరాలు సేకరించారు. 30న నల్లవల్లి, ప్యారానగర్, 31న కొత్తపల్లి, లక్ష్మాపూర్, 2న గుమ్మడిదల, 3న మంబాపూర్, 4న అన్నారం, 5న దోమడుగు, 6న బొంతపల్లిలో వ్యవసాయ అధికారుల నిర్ధారణ సర్వే ఉంటుందని, రైతులు గమనించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈవో శ్రీకాంత్, రైతులు పాల్గొన్నారు.


చండూరులో రైతుల వివరాలను తెలుసుకుంటున్న డీఏవో గోవింద్

18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు ఉండాలి

● **తహసీల్దార్ సురేష్‌కుమార్**

నిజాంపేట, ఆగస్టు 29: 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును కలిగి ఉండాలని తహసీల్దార్ సురేష్‌కుమార్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో గురువారం ఓటరు నమోదు, సవరణలపై బీఎల్‌వోలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్య దేశంలో ఓటు ప్రతి ఒక్కరి హక్కు అని, ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఓటర్ జాబితాలో ఏవైనా సవరణలు, మార్పులు ఉంటే 6,7,8 ఫామ్‌లో చేసుకోవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ గంగాధర్‌గౌడ్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలు మరిచి రాష్ట్ర ప్రభుత్వం కాలయాపన

సంగారెడ్డి రూరల్/నారాయణఖేడ్/మునిపల్లి, ఆగస్టు 29: ఇచ్చిన హామీలు మరిచి రాష్ట్ర ప్రభుత్వం కాలయాపన చేస్తున్నదని సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజ్ విమర్శించారు. గురువారం సంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట సీపీఎం నాయకులతో కలిసి ధర్నా చేసి మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు అర్హులందరికీ రెండు లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం డీఆర్వో పద్మజారాణికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు మల్లేశం, మాణిక్యం, జీ.సాయిలు పాల్గొన్నారు. అర్హులైన రైతులందరికీ కొర్రీలు లేకుండా రుణమాఫీ చేయాలని కోరుతూ సీపీఎం నాయకులు నారాయణఖేడ్ తహసీల్దార్ భాస్కర్‌కు వినతిపత్రం అందజేశారు. మునిపల్లి మండలంలో సీపీఎం నాయకులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ ఆశాజ్యోతికి వినతిపత్రం అందజేశారు.

ఘనంగా తెలుగుభాషా దినోత్సవం

సంగారెడ్డి రూరల్/పెద్దశంకరంపేట, ఆగస్టు 29: తెలుగుభాషా దినోత్సవాన్ని గురువారం ఆయా మండలాల్లో నిర్వహించారు. సంగారెడ్డిలోని స్ఫూర్తి డిగ్రీ కళాశాలలో బీకామ్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని కే.మణి 8.92 ర్యాంకు సాధించి కాలేజీ టాపర్‌గా నిలిచింది. గురువారం కళాశాల చైర్మన్ ధారాసింగ్, ప్రిన్సిపాల్ శర్మ, సన్మానించి జ్ఞాపికను అందజేశారు. పెద్దశంకరంపేటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం తెలుగుభాషా దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు.


విద్యార్థిని మణిని సన్మానిస్తున్న అధ్యాపకులు